క్లుప్తంగా

సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు



దుగ్గిరాల: సమాచార హక్కు చట్టంపై అవగాహన ప్రతి పౌరుడు కలిగి ఉండాలని వ్యవసాయశాఖ అధికారి పి.శిరీష పేర్కొన్నారు. శుక్రవారం ఈమని, పెదపాలెం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల వద్ద అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి.కృష్ణప్రసాద్, ఎ.రమేష్, అలేఖ్య, సౌమిత్ర పాల్గొన్నారు.

వీఓఏలకు శిక్షణ తరగతులు

దుగ్గిరాల: వీఓఏల శిక్షణ తరగతులు మూడో రోజు శుక్రవారం కొనసాగాయి. ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. వెలుగు ఏపీఎం సురేష్ కుమార్ మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో 1,538 డ్వాక్రా గ్రూపులకు సుమారు 235 ఎన్యూమరేటర్లు ఉండగా వారికి పలు అంశాలను వివరించామన్నారు. శ్రీనిధి మేనేజరు ఆనంద్ పాల్గొన్నారు.

వైభవంగా చండీ హోమం



దుగ్గిరాల: కంఠంరాజుకొండూరులోని మహంకాళీ అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం చండీ హోమం అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు పాల్గొని, అమ్మ వారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈఓ కె.సునీల్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆశలు నేలవాల్చింది..!



తాడేపల్లి రూరల్: మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల మండల పరిధిలో శుక్రవారం తెల్లవారుజామున అకాల వర్షం కురిసింది. ఈ ప్రభావం జొన్న, మొక్క జొన్న పంటలపై పడింది. జొన్న ఇప్పుడే కోతకు రావడంతో కంకులు నేల వాలాయి. మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా పసుపు 150 హెక్టార్లలో పండించగా.. ఇప్పటికే 50 హెక్టార్లకుపైగా పసుపు కొమ్ములను ఉడకబెట్టి పంట పొలాల్లో ఆరబోశారు. ఈ వర్షానికి నీళ్లు నిలబడిపోయి పసుపు పూర్తిగా తడిసిపోయిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. జొన్న కంకులు కిందకు వాలడంతో వాటిని కోయించి, ఆర బెట్టారు. మళ్లీ వర్షం పడకుంటే కొంతవరకు కోలుకున్నట్లేనని, ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా జొన్న పంటను కొనుగోలు చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వేగవంతంగా పీఎంజేవై సర్వే



ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో పీఎంజేవై(ప్రధాన మంత్రి జన్‌యోజన సురక్ష) సర్వే వేగవంతంగా ఆరోగ్య సిబ్బంది నిర్వహిస్తున్నట్లు వైద్యురాలు శ్వేత శుక్రవారం తెలిపారు. ఇంటింటికి వెళ్లి 70 ఏళ్లు ఉన్నవారి వివరాలు పేరు నమోదు చేస్తున్నారని చెప్పారు. రేషన్ కార్డులో పేర్లు నమోదు అయినవారివి కూడా యాప్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. దీనిద్వారా కేంద్రప్రభుత్వం అందజేస్తున్న కార్డు ద్వారా ఆరోగ్య సంబంధిత సమస్యలపై దేశంలోని ఏ ప్రాంతంలోనైనా సుమారు రూ. 5లక్షల వరకు చికిత్స పొందవచ్చన్నారు.

వీఆర్‌ఏల సదస్సును జయప్రదం చేయండి

ఫిరంగిపురం: వీఆర్‌ఏల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని వీఆర్‌ఏల సంఘం మండల గౌరవాధ్యక్షుడు షేక్.మస్తాన్‌వలి, మండల ప్రధాన కార్యదర్శి షేక్.కరిముల్నీసాలు కోరారు. మండలంలో శుక్రవారం వారు మాట్లాడుతూ రెవెన్యూ సహాయకుల రాష్ట్ర సదస్సు శనివారం విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తారన్నారు. అధిక సంఖ్యలో వీఆర్‌ఏల సదస్సులో పాల్గొని, జయప్రదం చేయాలని కోరారు. ఇప్పటివరకు ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయిస్తున్నారని, జీతాలు పెంచడంలేదని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ తరహాలో పేస్కేలు అమలు చేసి, వీఆర్‌ఏలకు డీఏ ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. అంతేకాక ఖాళీగా ఉన్న వీఆర్వో, నైట్‌వాచ్‌మెన్, అటెండర్ ఇతర పోస్టులను అర్హులైన వీఆర్‌ఏలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈసదస్సు వేదిక కానుందని తెలిపారు. సదస్సులో రాష్ట్ర నాయకులు జి.వెంకన్న, కె.ఉమామహేశ్వరరావు, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింహారావు, మాజీ ఎమ్మెల్సీ కేఎస్, లక్ష్మణరావు పాల్గొంటారని చెప్పారు.

అన్నీ ఉన్నా..



సాగులో ఉన్న మొక్కజొన్న పంట

- ప్రభుత్వ తీరుతో రైతులకు తప్పని నష్టం
- విస్తారంగా జొన్న, మొక్క జొన్న సాగు
- కోతలు మొదలైనా.. ప్రారంభ కాని కొనుగోళ్లు
- తక్కువ ధరకు జొన్న పంట విక్రయం
- త్వరలో మొక్క జొన్న కోతలు మొదలు
- స్పందించాలంటున్న కర్షకులు

మంగళగిరి: అన్నీ ఉన్నా..అల్లుడి నోట్లో శని అన్న చందంగా తయారైంది రైతుల పరిస్థితి. నియోజకవర్గంలోని కర్షకులు జొన్న, మొక్క జొన్న పంటలను అత్యధికంగా సాగుచేస్తున్నారు. జొన్న 5,600, మొక్క జొన్న 13,475 ఎకరాల్లో పండిస్తున్నారు. జొన్న కోతలు కొన సాగుతుండగా మొక్క జొన్న మరో 15 రోజుల్లో కోతకు రానుంది. పంటల దిగుబడి బాగుండడంతో రైతులు ఆనందపడుతున్నారు. కానీ, గిట్టుబాటు ధరలు లభించక ఇబ్బందులు పడుతున్నారు.

ప్రారంభం కాని కొనుగోళ్లు

ప్రభుత్వం జొన్న క్వింటాకు రూ.3,371ల మద్దతు ధర ప్రకటించినా.. రైతుల నుంచి పంట కొనుగోలు చేయడం లేదు. మార్క్‌ఫెడ్ అధికారులు కొనుగోలు అనుమతుల కోసం ప్రభుత్వానికి నివేదిక పంపినా.. అక్కడి నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. ఇక చేసేది లేక రైతులు బయట మార్కెట్‌లో క్వింటా రూ.1,900 నుంచి రూ.2వేలకు పంటను అమ్ముకుంటున్నారు. ఇక మొక్కజొన్న పరిస్థితి కూడా ఇలానే ఉంది. గిట్టుబాటు ధర రూ.2,225గా ఉంది. పంట దిగుబడి నాటికి ప్రభుత్వం ముందుకు వచ్చిన కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. జొన్న కోత కోసిన కొందరు రైతులు శుక్రవారం అకాల వర్షానికి నష్టపోయారు. చేల మీద ఉన్న పంట తడిసి రంగుమారడం, మొలకెత్తే అవకాశముండడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే కల్లంలో పంటను ఆరబోసి, తేమ లేకుండా చూసుకోవడం వల్ల నష్టం తగ్గించుకోవచ్చని వ్యవసాయశాఖ అధికారులు వారికి సూచిస్తున్నారు.



నూతక్కిలో అకాల వర్షానికి తడిసిన మొక్కజొన్నలను రోడ్డు వెంట ఆరబోసిన రైతులు

పెరిగిన సాగు విస్తీర్ణం

మంగళగిరి తాడేపల్లి మండలాల్లో 1000 ఎకరాలు జొన్న, 3వేల ఎకరాల్లో మొక్క జొన్న సాగవుతోంది. దుగ్గిరాల మండలంలో 4,600 ఎకరాల్లో జొన్న, 10,500 ఎకరాల్లో మొక్క జొన్న పంటలు సాగులో ఉన్నాయి. జొన్న పంటకు ఎకరాకు రూ.15 నుంచి రూ.20 వేలు పెట్టుబడి అవుతోంది. దిగుబడి ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్లుగా ఉంది. మొక్క జొన్న ఎకరాకు పెట్టుబడి రూ.20 నుంచి రూ.25 వేలు అవుతుండగా.. దిగుబడి 45 నుంచి 50 క్వింటాళ్లు వస్తోంది.

ఇళ్ల పట్టాల పంపిణీ తొలి అడుగు మాత్రమే

298 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన మంత్రి నారా లోకేష్

మంగళగిరి: ఇళ్ల పట్టాల పంపిణీ తొలి అడుగు మాత్రమేనని, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. నగర పరిధిలోని యర్రబాలెం డాన్ బాస్కో స్కూలు వద్ద ఏర్పాటు చేసిన ప్రాంగణంలో శుక్రవారం మన ఇల్లు - మన లోకేష్, పేదలకు పట్టాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. నీరుకొండ గ్రామస్తులు 99, రత్నాల చెరువుకు చెందిన 199 మంది లబ్ధిదారులు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్కులు, చెరువుల అభివృద్ధి, కల్యాణ మండపాల నిర్మాణం చేపట్టి, డ్రెయినేజీకి శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. భూ గర్భ గ్యాస్, విద్యుత్ సరఫరాను అందజేస్తామని వెల్లడించారు. ముఖ్యంగా వంద పడకల ఆసుపత్రి నిర్మాణం త్వరితగతిన పూర్తిచేయడం జరుగుతుందన్నారు. స్వచ్ఛ మంగళగిరిలో భాగంగా నియోజకవర్గంలో ఎక్కడా చెత్త కనపడకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎండీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, పద్మశాలీయ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ నందం అబద్దయ్య, మార్కెట్ యార్డు చైర్మన్ జవ్వాది కిరణ్ చందు, నాయకులు పాల్గొన్నారు.



పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి నారా లోకేష్

భవిష్యత్తును తీర్చిదిద్దేది విద్యే

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్

మంగళగిరి: మనిషి భవిష్యత్తును తీర్చిదిద్దేది విద్య మాత్రమేనని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ స్కూలు ప్రథమ వార్షికోత్సవం కార్యక్రమానికి హాజరైన మంత్రి మాట్లాడుతూ ప్రాథమిక విద్య అనేది ప్రతి వ్యక్తికి కీలకమని పేర్కొన్నారు. చిన్నతనం సంస్కారవంతమైన విద్య వారి భవిష్యత్తును తీర్చిదిద్దుతుందని చెప్పారు. సమాజం అభివృద్ధి చెందాలంటే నేటి యువత వలనే సాధ్యమవుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, బీజేపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు మిట్టా వంశీ, పద్మశాలీయ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, డైరెక్టర్ కొండా నవనీత్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

మానవత్వం చాటుకున్న తహసీల్దారు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లి గ్రామం, రెడ్ల బజార్ ప్రాంతంలో గుర్తు తెలియని వృద్ధుడు ఓ నివాసం ముందు ఉన్న అరుగు మీద పడుకున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున భారీగా వర్షం కురవడంతో కదలలేని స్థితిలో అక్కడే ఉన్నాడు. విషయం తెలుసుకున్న తాడేపల్లి తహసీల్దార్ సీతారామయ్య సిబ్బందితో కలసి అక్కడకు వెళ్లి వృద్ధుడికి అల్పాహారం అందించి, వివరాలు తెలుసుకునే ప్రయత్నాలు చేశారు. ఆ వృద్ధుడు స్పందించి తనది ప్రకాశం జిల్లా, అర్ధవీడు మండలం, వీరభద్రపురం గ్రామం అని చెప్పుకొచ్చారు. తనకు ఆరుగురు సంతానమని, భార్య కాలం చేసిందని తహసీల్దారుకు వివరించాడు. సిబ్బంది సహకారంతో ఆ వృద్ధుడిని తన కారులో ఎక్కించుకుని తాడేపల్లిలోని అఖిల భారతీయ బ్రాహ్మణ కరివేన నిత్యాన్నదాన సత్రం, వృద్ధాశ్రమంలో తహసీల్దారు చేర్పించారు. వృద్ధుడిని అక్కడ వదిలేసిన అనంతరం అతని కుటుంబ సభ్యుల వివరాల కోసం ప్రకాశం జిల్లా, అర్ధవీడు మండలం రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. సదరు వృద్ధుడి పరిస్థితిని వివరించారు. ఆ వృద్ధుడి కుటుంబ సభ్యులకు విషయాన్ని తెలియజేసి, వచ్చి తీసుకువెళ్లేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.



వృద్ధుడి వివరాలు తెలుసుకుంటున్న తహసీల్దారు సీతారామయ్య

సమాచార హక్కు చట్టంపై అవగాహన

ఫిరంగిపురం: నుదురుపాడు గ్రామంలో శుక్రవారం సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. ఏవో వాసంతి మాట్లాడుతూ 2005లో ప్రారంభించబడిన సమాచార హక్కు చట్టం ప్రభుత్వ ఉద్యోగుల పనితీరు, ప్రభుత్వం చేపట్టిన వివిధ కార్యక్రమాల గురించి తెలుసుకోవచ్చన్నారు. అనంతరం 50 శాతం రాయితీపై పచ్చి రొట్ట ఎరువులు వచ్చే నెల నుంచి అందజేస్తామని, రైతులు దీనిని వినియోగించుకోవాలని చెప్పారు. వ్యవసాయ విస్తరణాధికారి షేక్.సుభానీ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఆహ్వాన పత్రికలు

తాడేపల్లి రూరల్: మన ఇల్లు – మన లోకేష్ పేరుతో ఇస్తున్న పట్టాలు ఆహ్వాన పత్రికలను లబ్ధిదారులకు శుక్రవారం తాడేపల్లి టీడీపీ అధ్యక్షుడు వల్లభనేని వెంకటరావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఇచ్చిన హామీ ప్రకారం మంత్రి నారా లోకేష్ పేదలకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్నారని తెలిపారు. పేదలకు పట్టాభిషేకం కార్యక్రమంలో భాగంగా మన ఇల్లు మన లోకేష్ పేరుతో ఇస్తున్న పట్టాల పంపిణీ కార్యక్రమంలో లబ్ధిదారులను ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రికలు అందజేశామని తెలిపారు. టీడీపీ తాడేపల్లి ప్రధాన కార్యదర్శి దారదాసు, సీనియర్ నాయకులు అద్దంకి మురళి తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి



మేడికొండూరు: మండల పరిధిలోని అన్ని దేవాలయాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సీఐ నాగూర్ మీరా సాహెబ్ సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం దేవాలయాల పూజారులు, కమిటీ చైర్మన్‌లు, సభ్యులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. దొంగతనాలు అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

ఎన్నారైలో జగ్జీవన్‌రామ్ జయంతి

మేడికొండూరు: స్థానిక ఎన్నారై ఇంజినీరింగ్ కళాశాలలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి శుక్రవారం నిర్వహించారు. ప్రిన్సిపల్ కోట శ్రీనివాసు మాట్లాడుతూ అతి చిన్న వయసులో నెహ్రూ మంత్రివర్గంలో పనిచేసిన ఘనత బాబు జగజ్జీవన్ రామ్ దక్కుతోందన్నారు. కార్మిక శాఖ మంత్రిగా, 1971లో ఇండోపాక్ యుద్ధంలో రక్షణ శాఖ మంత్రిగా కూడా విధులు నిర్వహించారన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ కె.శ్రీహరి మాట్లాడుతూ బీహార్‌లోని అత్యంత వెనుకబడిన గ్రామంలో జన్మించి అంటరానితనాన్ని ఎదిరించి, 1931లో కలకత్తా విశ్వవిద్యాలయం నుంచి బీఎస్సీ డిగ్రీ పొందారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏవో సీతారామయ్య, వివిధ శాఖాధిపతులు చంద్రమౌళి, రెహమాన్, కె.ఎస్ఆర్ నాగేశ్వరరావు, సౌజన్య, కోటేశ్వరరావు, రాము పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ జయంతి

మంగళగిరి: పట్టణంలోని జాతీయ రహదారి వెంబడి ఉన్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో శనివారం మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించనున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఆప్కో చైర్మన్ చిల్లపల్లి మోహనరావు పాల్గొంటారని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ కోట శ్రీనివాస్

పేరేచర్లలో చెత్త సేకరణకు స్పెషల్ డ్రైవ్

మేడికొండూరు: మండలంలోని పేరేచర్ల గ్రామంలో శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ కార్యక్రమం చేపట్టారు. జిల్లా పంచాయతీ అధికారి నాగ సాయికుమార్ పాల్గొని ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి గ్రామ పంచాయతీలో ఇంటి నుంచి చెత్త సేకరణ కార్యక్రమం జరగాలని తెలిపారు. తడి, పొడి చెత్తను వేరుచేసి, తడి చెత్త నుంచి వర్మి కంపోస్టు తయారు చేయాలని తెలిపారు. కంపోస్ట్ ఎరువును విక్రయించి, పంచాయతీకి ఆదాయం సమకూర్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. హరిత రాయబారులు విధిగా ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించాలని సూచించారు. విస్తరణ అధికారి పాటిబండ్ల పూర్ణ శంకరరావు, పంచాయతీ కార్యదర్శులు రామ సుబ్బారావు, పి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.



చెత్త సేకరణను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి నాగ సాయికుమార్

తడిసిన పసుపు పంట



దుగ్గిరాల: అకాల వర్షం వల్ల జొన్న, పసుపు రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. దుగ్గిరాల మండలంలో పలు గ్రామాలలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి పంట నష్టం వాటిల్లింది. వారం క్రితం పలుచోట్ల జొన్న పంటను కోత కోశారు. జొన్న తడవటం వల్ల మొలకెత్తడం, రంగు మారి తక్కువ ధర పలుకుతాయని, బరువు కూడా తక్కువ వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ

తాడేపల్లి రూరల్: ప్రజలపై అదనపు భారంగా ఉన్న విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై. నేతాజీ అన్నారు. శుక్రవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లిలో స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకిస్తూ ప్రచారం నిర్వహించి, కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ గతంలో నారా లోకేష్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మోదీ విధానాలనే రాష్ట్రంలో అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, కుంచనపల్లి గ్రామ శాఖ కార్యదర్శి అమ్మిశెట్టి రంగారావు, సింగంశెట్టి రవికిషోర్, బొడ్డు మోహనరావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

రైలులో ప్రయాణిస్తూ... యువకుడి మృతి

తెనాలిరూరల్: రైలులో ప్రయాణిస్తున్న యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుమారు 23 నుంచి 25 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని యువకుడు రప్తిసాగర్ ఎక్స్‌ప్రెస్‌లో కోయంబత్తూర్ నుంచి ఉత్తర్ ప్రదేశ్‌కు వెళుతున్నాడు. రైలు శుక్రవారం బాపట్ల దాటగానే యువకుడు ఉలుకు లేకుండా పడి ఉండడంతో గమనించిన తోటి ప్రయాణికులు టీసీకి సమాచారమివ్వడంతో ఆయన అధికారులకు తెలిపి, తెనాలిలో రైలును ఆపి మృతుడిని కిందు దింపారు. రైల్వే వైద్యురాలు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్టు ధృవీకరించారు. మృతదేహాన్ని జీఆర్పీ పోలీసులు తెనాలి జిల్లా వైద్యశాల మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేశారు.

మార్నింగ్ స్టార్‌లో జాబ్ మేళా



ఫిరంగిపురం: మండలకేంద్రంలోని మార్నింగ్‌స్టార్ కళాశాలలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించారు. మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్, విసర్చర్ ఐటీ సౌజన్యంతో ఈ మేళా నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ మద్దు బాలస్వామి మాట్లాడుతూ ఏటా ఇటువంటి జాబ్ మేళాను నిర్వహిస్తామని చెప్పారు. దీనిద్వారా కళాశాల విద్యార్థులకు, నిరుద్యోగ యువకులకు ఉద్యోగ అవకాశాలు చేకూరుతాయన్నారు. కార్యక్రమంలో 86మంది అభ్యర్థులకు వివిధ కంపెనీల తరుపున ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. పది కంపెనీల ప్రతినిధులు పాల్గొనగా వీటిలో కొన్ని ఎంఎన్‌సీలు కావడం విశేషం. పాల్గొన్న అభ్యర్థులు టెక్ మహీంద్రా, జెన్‌పాక్ట్, యాక్సిస్ బ్యాంకు, బ్లూస్టార్ కంపెనీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ప్రిన్సిపల్ ఇ.హరినాథ్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాడ్లు, పలుగులతో యువకుల హల్‌చల్

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రేపల్లె-కనకదుర్గ వారధి మధ్య కొంతమంది గుర్తుతెలియని యువకులు చేతుల్లో రాడ్లు, పలుగులు పట్టుకుని గురువారం అర్ధరాత్రి హల్‌చల్ చేశారు. పలుమార్లు కనకదుర్గ వారధి వద్దకు, ప్రాతూరు వరకు అటూ ఇటూ తిరగడంతో రోడ్డుపై ప్రయాణించేవారిని తీవ్ర భయాందోళనలకు గురిచేశారు. ఒకానొక సమయంలో ఆగిఉన్న లారీ చాటున దాక్కుని దాడి చేసినట్లుగా రాడ్లు, పలుగులతో రావడంతో భయపడిన ద్విచక్ర వాహనదారులు కిందపడినట్లు తెలిసింది. దీనిని వీడియో తీస్తున్న ఓ యువకుడ్ని వెంబడించారు. ఇదిలా ఉండగా తాడేపల్లి పోలీసులు ఫ్లెక్సీలు కట్టేందుకు వచ్చారని, అలాంటి ఘటనలు జరగలేదని చెప్పడం విశేషం. ఈ ఘటనతో చాలా భయాందోళనకు గురయ్యామని స్థానికులు చెప్పారు. అనుమతులు లేకుండా అర్ధరాత్రిళ్ల ఫ్లెక్సీలు కడుతున్నామని, అందుకే పలుగు, రాడ్లు ఉన్నాయని పోలీసులకు వారు చెబితే ఎలా వదిలేస్తారని నిలదీస్తున్నారు.

చిన్నపాటి వర్షానికే రోడ్లు జలమయం

మంగళగిరి టౌన్: మంగళగిరి నగరపరిధిలో శుక్రవారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. ఒకపక్క భానుడు భగభగమనడంతో ఈ వర్షానికి ప్రజలు కొంత ఉపశమనం పొందారు. అయితే మంగళగిరి నగరంలో వివిధ ప్రాంతాల్లో చిన్నపాటి వర్షానికే రోడ్లమీద నీరు నిలిచి, రాకపోకలకు అంతరాయం కలిగింది. 15వ వార్డు బాప్టిస్టు పేటలో డ్రెయినేజీ నీరు బయటకు రావడంతో ఆ వీధి మొత్తం నీటితో మునిగిపోయింది. ఎప్పుడు వర్షం పడినా ఇక్కడ ఈ రోడ్డు అంతా మురికిమయం అవుతుందని స్థానికులు చెబుతున్నారు. నగర పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులా ఉన్న కాలువలు ఎత్తు లేకపోవడం, పూడికలు తొలగించకపోవడంతో ఏపాటి చిన్న వర్షం వచ్చినా ప్రధాన రహదారిపై పడే వర్షపు నీరు కాలువలోకి ప్రవహించేందుకు అవకాశం లేకుండా పోయింది.



బాప్టిస్ట్‌పేటలో జలమయమైన రోడ్డు

తల్లిదండ్రుల చెంతకు మంగళగిరి అమ్మాయి శ్రీవర్షిణి

మంగళగిరి: గత నెల 26న అఘోరి వెంట వెళ్లిన మంగళగిరి అమ్మాయి శ్రీవర్షిణిని తల్లిదండ్రుల చెంతకు చేరింది. తెలంగాణలోని మంచిర్యాల జిల్లా, నన్నెలకు చెందిన అల్లూరి శ్రీనివాస్ మహిళా అఘోరీగా అవతారమెత్తి హల్‌చల్ చేస్తున్న సంగతి తెలిసిందే. మంగళగిరికి వచ్చిన ఈ అఘోరికి దుస్తులు, భోజనం పెట్టే క్రమంలో శ్రీవర్షిణి దగ్గరైంది. అతని మాటలకు ఆకర్షితురాలైన తాను కూడా అఘోరిగా మారవచ్చని ఆమె భావించింది. అఘోరితో కలిసి వెళ్లిపోయింది. మొదట మంచిర్యాల చేరుకున్న అఘోరి, శ్రీవర్షిణి అక్కడి నుంచి గుజరాత్ వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో అమ్మాయి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుజరాత్ లో అఘోరీని పోలీసుల అదుపులోకి తీసుకుని, మంగళగిరిలోని శ్రీవర్షిణి తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. దీంతో ఆమె తల్లిదండ్రులు, సోదరులు గుజరాత్ చేరుకుని శ్రీవర్షిణిని ఇంటికి తీసుకొస్తున్నారు. శనివారం వారు మంగళగిరి చేరుకుంటారని సమాచారం.

జోరుగా ఎడ్ల బల ప్రదర్శన

తెనాలిరూరల్: స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో జరుగుతున్న ఆలపాటి శివరామకృష్ణయ్య మెమోరియల్ రాష్ట్రస్థాయి ఎడ్ల బల ప్రదర్శన, పశు పాల ప్రదర్శన పోటీలు చివరి రోజు జోరుగా సాగాయి. గత నెల 29 నుంచి జరుగుతున్న పోటీల్లో చివరి రోజైన శుక్రవారం సీనియర్స్ విభాగం పోటీలు నిర్వహించగా, 11 జతల ఎడ్లు పోటీ పడ్డాయి. జూనియర్స్ విభాగ పోటీల్లో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెంకు చెందిన అత్తోట శిరీషచౌదరి, శివకృష్ణ చౌదరిల ఎడ్ల జత నిర్ణీత సమయంలో 3582 అడుగులు లాగి ప్రథమ బహుమతిని పొందాయి. హైదరాబాద్‌కు చెందిన డి. రోహన్ బాబు ఎడ్ల జత (3307.07 అడుగులు) రెండో బహుమతిని, గుంటూరుకు చెందిన సోమిశెట్టి ఆంజనేయులు ఎడ్ల జత(3033.01 అడుగులు) మూడో బహుమతిని సాధించాయి. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, పారిశ్రామికవేత్త ముళ్లపూడి నరేంద్రనాథ్, 1875లో బ్రెజిల్ దేశానికి ఒంగోలు జాతి గిత్తలను తీసుకెళ్లిన కుటుంబ వారసుడు మార్సెల్లో అతిథులుగా హాజరయ్యారు. జూనియర్స్ విభాగంలో విజేతలకు బహుమతులను అందజేశారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, పోటీల కన్వీనర్ నక్కా ఆనందబాబు పర్యవేక్షించారు. సూరపనేని రాధాకృష్ణమూర్తి రిఫరీగా వ్యవహరించారు. ఈ పోటీలు శుక్రవారం రాత్రి వరకు జరిగాయి.

వేలం ప్రకటన

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE : SATTENAPALLI
E.P No. 3 / 2023 in O.S. No. 3 / 2022
Between:
Kikkuru Lakshmi ...DHR/Plaintiff
AND
Pakanati Srinivasa Reddy ...JDR/Defendant

... ది.23-04-2025న ... 10-30గం||లకు ...

Schedule: Guntur Dt., Phirangipuram Sub-Division-113 Thalluru Gramma Panchayathi area, 113 Thalluru Gramma Panchayathi D.No.126/A1 the total extent of Ac.6 38 cents in this the extent of Ac.1 75 cents wet land bounded by-East: NSP Kaluva, South: land belongs to Shaik Syadula, West: land of Pakanati Anji Reddy, North: land of Chavali Sankar Reddy & Shaik Sydulu etc. In the above said boundaries the extent of Ac.1-75 cents on 0-707 wet land only.
(By Order of the Hon'ble Court)
DHR Value : Rs. 23,00,000/-
Ameena Value : Rs. 18,00,000/-
వేలం వాయిదా తేదీ: 23-04-2025
... : 30-04-2025.
... 2585/2015 ... రూ. 1,60,000/- ...

YARRAMREDDY VENKATESWARA REDDY
Advocate for DHR, Guntur. Cell: 9441126993